క్లుప్తంగా

రేపు దేవునిపడకల్ గేట్ ఆర్చి ప్రారంభం

తలకొండపల్లి: మండలంలోని దేవుని పడకల్ గేట్ ముఖద్వారాన్ని(ఆర్చి) ఈ నెల 10న ప్రారంభించనున్నట్లు కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు డోకూరి ప్రభాకర్‌రెడ్డి గురువారం తెలిపారు. డోకూరి రాంరెడ్డి జ్ఞాపకార్థం నిర్మించిన ముఖ ద్వారాన్ని మంత్రి జూపల్లి కృష్ణారావు ప్రారంభించనున్నారని ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. ఎంపీ మల్లు రవి, సీడబ్ల్యూసీ కార్యదర్శి చల్లా వంశీచంద్‌రెడ్డి, ఎమ్మెల్యేలు కసిరెడ్డి నారాయణరెడ్డి, వంశీకృష్ణ, రామ్మోహన్‌రెడ్డి ముఖ్య అతిథిలుగా హాజరు కానున్నారన్నారు. కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ప్రభాకర్‌రెడ్డి కోరారు.

తహసీల్దార్ భవన నిర్మాణ పనుల పరిశీలన

కడ్తాల్: మండల కేంద్రంలో నూతనంగా నిర్మిస్తున్న తహసీల్దార్ కార్యాలయ భవన నిర్మాణ పనులను డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్‌రెడ్డితో పాటు, పలువురు నాయకులు గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భవన నిర్మాణ పనులు పూర్తయిందన్నారు. త్వరలోనే ప్రారంభించేందుకు తగిన ఏర్పాట్లు చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ శంకర్, నాయకులు జహంగీర్ అలీ తదితరులు ఉన్నారు.

గాంధీజీ మార్గాన్ని అనుసరించండి




చేనేత కార్మికులతో కలిసి చరకతో దారం వడుకుతున్న రాజేందర్‌రెడ్డి

హయత్‌నగర్: జాతిపిత మహాత్మాగాంధీ చూపిన శాంతి, అహింస, సత్యం, క్రమశిక్షణలను ప్రతిఒక్కరూ అనుసరించాలని గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ చైర్మన్ గున్న రాజేందర్‌రెడ్డి సూచించారు. కుంట్లూర్‌లోని గాంధీ కాలేజ్ ఆఫ్ ఎడ్యుకేషనల్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న చేనేత శతాబ్ది ఉత్సవాల్లో ఆయన గురువారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... ప్రతిఒక్కరూ చేనేత వస్త్రాలను ధరించాలన్నారు. చేనేత కార్మికుల ఉపాధి కోసం ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలన్నారు. వస్త్రాల విశిష్టతను విరివిగా ప్రచారం చేసేందుకు గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ చర్యలు తీసుకుంటుందని తెలిపారు. ఈ సందర్భంగా చేనేత కార్మికులను ఆయన సత్కరించారు. కార్యక్రమంలో గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ వైస్ చైర్మన్ యానాల ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

నీటి శుద్ధి కేంద్రం ప్రారంభం

తలకొండపల్లి: స్వచ్ఛమైన నీటిని సేవించడంతో ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని లవ్ ఫర్ కౌ ఫౌండేషన్ చైర్మన్ జస్మత్‌భాయ్ పటేల్ సూచించారు. గురువారం మండలంలోని రాంపూర్‌లో సింగిల్ విండో డైరెక్టర్ ఎండీ నయీముద్దీన్ సొంత ఖర్చులతో వాటర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేశారు. దీనిని జస్మత్‌భాయ్ పటేల్ ప్రారంభించారు. ప్రజలకు ఉచితంగా శుద్ధ నీటిని అందించాలనే లక్ష్యంతో తన తండ్రి జ్ఞాపకార్థం ప్లాంట్‌ను ఏర్పాటు చేసినట్లు నయీముద్దీన్ తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు శ్యాంసుందర్‌రెడ్డి, శ్రీనివాసాచారి, ఎంపీటీసీ మాజీ సభ్యుడు వెంకటయ్య, నాయకులు యాదయ్య, హరిమోహన్‌రెడ్డి, కృష్ణ, శివ, మనోహర్, కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

సీసీ కెమెరాల ఏర్పాటుకు నగదు సాయం



సీఐకి చెక్కు అందజేస్తున్న అసోసియేషన్ సభ్యులు

ఆమనగల్లు: పట్టణంలో సీసీ కెమెరాల ఏర్పాటుకు ఆమనగల్లు మెడికల్ అసోసియేషన్ ఆర్థికసాయం అందించింది. గురువారం స్థానిక పోలీసుస్టేషన్‌లో సీఐ ప్రమోద్‌కుమార్‌కు మెడికల్ అసోసియేషన్ సభ్యులు ఈ మేరకు చెక్కును ఇచ్చారు. కార్యక్రమంలో ఎస్ఐ వెంకటేశ్, అసోసియేషన్ సభ్యులు యాదయ్య, రవీంద్రానంద్, అరవింద్, రామకృష్ణ, ప్రవీణ్, శేఖర్, భాస్కర్, డా.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

తిరుపతిరెడ్డికి శుభాకాంక్షలు

మహేశ్వరం: సీఎం రేవంత్‌రెడ్డి సోదరుడు, ఎనుముల తిరుపతి రెడ్డి జన్మదినం సందర్భంగా పలువురు నాయకులు శుభాకాంక్షలు తెలిపారు. మహేశ్వరం మండల కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, తుమ్మలూరు మాజీ సర్పంచ్ మద్ది కరుణాకర్‌రెడ్డి గురువారం నగరంలోని ఆయన నివాసంలో కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

పరిసరాల శుభ్రతకు పెద్దపీట



ఆమనగల్లు: ర్యాలీలో పాల్గొన్న మున్సిపల్ కమిషనర్ వసంత తదితరులు



యాచారం: చౌదర్‌పల్లిలో జ్వర సర్వే నిర్వహిస్తున్న ఎంపీడీఓ నరేందర్‌రెడ్డి

- కొనసాగుతున్న స్వచ్ఛదనం-పచ్చదనం
- ర్యాలీలతో అవగాహన కల్పించిన అధికారులు

ఇబ్రహీంపట్నం: స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమం ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీలో ముమ్మరంగా కొనసాగుతుంది. అందులో భాగంగా ఫీవర్ సర్వేను గురువారం ప్రారంభించారు. దోమల నివారణకు మురుగు కాలువల్లో రసాయనాలు స్ప్రే చేశారు. అదేవిధంగా గురుకుల విద్యాలయం, ప్రభుత్వ ఉన్నత పాఠశాలలకు వెళ్లి వీధి కుక్కల బెడద నుంచి ఎలా రక్షించుకోవాలో విద్యార్థులకు పర్యావరణ ఇంజనీర్ ప్రణవ్ అవగాహన కల్పించారు. ఆయా కార్యక్రమాల్లో వైద్య సిబ్బంది సరిత, హేమలాల్, అంగన్‌వాడీ వర్కర్లు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

వసతి గృహంలో వైద్య శిబిరం

ఆమనగల్లు: మండలంతో పాటు మున్సిపాలిటీలో స్వచ్ఛదనం- పచ్చదనం కార్యక్రమం కొనసాగుతుంది. ఆమనగల్లులో మున్సిపల్ కమిషనర్ వసంత ఆధ్వర్యంలో స్థానికంగా పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహించారు. స్థానిక ప్రభుత్వాస్పత్రి వైద్యాధికారి పరిక్షిత్ నరేందర్, మున్సిపల్ కమిషనర్ వసంతల ఆధ్వర్యంలో పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. స్థానిక గిరిజన బాలికల వసతి గృహంలో ప్రభుత్వాస్పత్రి ఆధ్వర్యంలో ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించి విద్యార్థులకు పరీక్షలు చేశారు. అలాగే ఇంటింటికి తిరుగుతూ వైద్య సిబ్బంది ఫీవర్ సర్వే చేపట్టారు.

పర్యావరణ పరిరక్షణకు కృషి

మాడ్గుల: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎంపీడీఓ పద్మావతి సూచించారు. అందులో భాగంగా మొక్కలు నాటి, వాటిని సంరక్షించాలని ఆమె కోరారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్వచ్ఛదనం-పచ్చదనంలో భాగంగా కోల్కులపల్లి గ్రామంలో అధికారులు, నాయకులు కలిసి మొక్కలు నాటారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి, సిబ్బంది పాల్గొన్నారు.



తలకొండపల్లి: కుటుంబ సభ్యుల వివరాలు తెలుసుకుంటున్న వైద్య సిబ్బంది



మాడ్గుల: కోల్కులపల్లిలో మొక్క నాటుతున్న ఎంపీడీఓ పద్మావతి

ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి

తుర్కయంజాల్: ప్రజలంతా తమ ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని మున్సిపల్ కమిషనర్ కె.అమరేందర్‌రెడ్డి సూచించారు. స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలో భాగంగా ఫీవర్ సర్వే నిర్వహించారు. ఆయన పలు వార్డుల్లో పర్యటించి, సర్వే వివరాలను అడిగి తెలుసుకున్నారు. కుక్కల నియంత్రణ కోసం ప్రత్యేక కార్యాచరణ రూపొందించామన్నారు. కార్యక్రమంలో వైస్ చైర్‌పర్సన్ హరితధన్‌రాజ్‌గౌడ్, మేనేజర్ శ్రీధర్‌రెడ్డి, పలువురు కౌన్సిలర్లు పాల్గొన్నారు.

ఇంటింటికీ జ్వర సర్వే

యాచారం: స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలో భాగంగా మండలంలోని పలు గ్రామాల్లో అధికారులు ఇంటింటికీ వెళ్లి జ్వర సర్వే నిర్వహించారు. గ్రామాల్లో జ్వరాలు వస్తున్నాయా.. కాళ్ల, కీళ్ల నొప్పులు ఇతర వ్యాధులపై వివరాలు అడిగి నమోదు చేసుకున్నారు. ఆయా గ్రామాల్లో నిర్వహించిన సర్వేలో ఎంపీడీఓ నరేందర్‌రెడ్డి, మండల పంచాయతీ అధికారి శ్రీలత పాల్గొన్నారు.

దోమలు వ్యాప్తి చెందకుండా చర్యలు

తలకొండపల్లి: పరిసరాలను ఎప్పుడూ పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎంపీడీఓ శ్రీకాంత్ అన్నారు. ప్రతిఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించాలన్నారు. స్వచ్ఛదనం, పచ్చదనంలో భాగంగా తుమ్మలకుంట తండా, ఖానాపూర్‌లలో గురువారం ఎంపీడీఓ పర్యటించారు. ఈగలు, దోమలు వ్యాప్తి చెందకుండా తగు నివారణ చర్యలు తీసుకోవాలని సూచించారు. గ్రామంలో నిర్వహిస్తున్న ఫీవర్ సర్వేలో ఎంపీడీఓ పాల్గొన్నారు. సీజనల్ వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలని అవగాహన కల్పించారు. ఏపీఓ కృష్ణ, డాక్టర్ చంద్రసింగ్, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

శాశ్వత ఉద్యోగులుగా గుర్తించాలి

- ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు గ్యార పాండు
- ఎంపీడీఓ కార్యాలయాల ఎదుట పంచాయతీ కార్మికుల నిరసన



తలకొండపల్లి: భిక్షాటన చేస్తున్న యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు పాండు, నాయకులు

యాచారం/తలకొండపల్లి: పంచాయతీ కార్మికులను శాశ్వత ఉద్యోగులుగా గుర్తించాలని ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్(సీఐటీయూ) రాష్ట్ర అధ్యక్షుడు గ్యార పాండు డిమాండ్ చేశారు. యూనియన్ పిలుపు మేరకు గురువారం యాచారం, తలకొండపల్లి ఎంపీడీఓ కార్యాలయాల ఎదుట గ్రామ పంచాయతీ కార్మికులతో ఆయన ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా 12,769 పంచాయతీల్లో 52 వేల మంది పని చేస్తున్నారన్నారు. కోవిడ్ లాంటి పరిస్థితుల్లో కూడా ప్రాణాలకు సైతం లెక్క చేయకుండా శ్రమించారని గుర్తుచేశారు. అలాంటి వారిని ప్రభుత్వం వెంటనే పర్మినెంట్ ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. కారోబార్, బిల్ కలెక్టర్లను సహాయ కార్యదర్శులుగా నియమించాలని, విధి నిర్వహణలో మృతి చెందితే రూ.10 లక్షల పరిహారం అందజేసి, ఆ కుటుంబంలో ఒక్కరికి ఉద్యోగం కల్పించాలన్నారు. కార్యక్రమాల్లో సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి బ్రహ్మయ్య, వ్యకాసం జిల్లా అధ్యక్షుడు అంజయ్య, మండల కన్వీనర్ చందునాయక్, ఆమనగల్లు సీఐటీయూ ఏరియా కన్వీనర్ పెంటయ్య, యూనియన్ అధ్యక్షుడు జంగయ్య, ఆయా గ్రామాల పంచాయతీ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

వయనాడ్ బాధితుల కోసం భిక్షాటన

కేరళ వయనాడ్ బాధితులను ప్రతి ఒక్కరూ ఆదుకోవాలని ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు గ్యార పాండు ప్రజలను కోరారు. తలకొండపల్లిలో గ్రామ పంచాయతీ కార్మికులతో కలిసి ఆయన భిక్షాటన చేసి డబ్బులు సేకరించారు. కేరళలో జరిగిన ప్రకృతి విలయ తాండవాన్ని కేంద్ర ప్రభుత్వం స్పందించి జాతీయ విపత్తుగా ప్రకటించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

కనీస వేతనాలు అమలు చేయాలి

ఇబ్రహీంపట్నం: ఎన్నికల ముందు గ్రామ పంచాయతీ కార్మికులకు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని సీఐటీయూ మండల కన్వీనర్ బుగ్గరాములు డిమాండ్ చేశారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో గురువారం గ్రామ పంచాయతీ కార్మికులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామ పంచాయతీ కార్మికుల ఉద్యోగాలను పర్మినెంట్ చేసి, కనీస వేతనాలు అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో కారోబార్లు దేవదాస్, యాదయ్య, మల్లేశ్, నరేశ్, బాలరాజ్, చంద్రయ్య, పోచయ్య, రాములు, కిషన్ అనిత తదితరులు పాల్గొన్నారు.



ఇబ్రహీంపట్నం: తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న గ్రామ పంచాయతీ కార్మికులు

ఆధ్యాత్మిక చింతనతో ప్రశాంతత



వాల్ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే నారాయణరెడ్డి

ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

ఆమనగల్లు: ప్రతి ఒక్కరూ భక్తిభావాన్ని అలవర్చుకోవాలని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి సూచించారు. దేవాలయాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తుందని ఆయన చెప్పారు. హైదరాబాద్‌లోని ఎమ్మెల్యే నివాసంలో గురువారం మండలంలోని ఆకుతోటపల్లి రజకసంఘం ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించిన శ్రీ మడేలేశ్వర మహాదేవస్వామి ఆలయంలో ఈనెల 17 నుంచి మూడు రోజుల పాటు జరిగే విగ్రహ ప్రతిష్ఠ ఉత్సవాల కరపత్రాలు, వాల్ పోస్టర్లను నారాయణరెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ప్రజల సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తుందన్నారు. విద్యార్థులకు మెరుగైన విద్యను అందించడానికి అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించినట్లు ఆయన వివరించారు. గుడి, బడి బాగుంటేనే ప్రజలు బాగుంటారన్నారు. శిథిలావస్థకు చేరిన దేవాలయాలను పునరుద్ధరించేందుకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ శ్రీపాతి శ్రీనివాస్‌రెడ్డి, ఆలయ చైర్మన్ కానుగుల మల్లేశ్, రజక సంఘం అధ్యక్షుడు రామచంద్రయ్య, సభ్యులు వేణు, రామచంద్రయ్య, యాదయ్య, వెంకటయ్య, రాములు, శ్రీను, శేఖర్ పాల్గొన్నారు.

మెనూ ప్రకారం భోజనం

మండల ప్రత్యేకాధికారి శ్రీలక్ష్మి

మహేశ్వరం: హాస్టళ్లలో విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం వడ్డించాలని జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్, మండల ప్రత్యేకాధికారి శ్రీలక్ష్మి పేర్కొన్నారు. గురువారం మండల పరిధిలోని ఉప్పుగడ్డ తండా సమీపంలోని గిరిజన బాలుర గురుకుల హాస్టల్‌ను ఆమె సందర్శించి, వంట శాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె విద్యార్థులతో మాట్లాడారు. వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. పాఠశాల సమావేశాల్లో డెంగీ, మలేరియాపై అవగాహన సదస్సులు నిర్వహించుకోవాలన్నారు. ఆరోగ్య కార్యకర్తలతో సమన్వయం చేసుకుంటూ సీజనల్ వ్యాధుల నివారణకు తగిన చర్యలు తీసుకోవాలని సిబ్బందికి ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ శైలజ, ఎంపీఓ రవీందర్, ఆరోగ్య శాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

వరద బాధితులకు అండగా నిలవాలి

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్: కేరళలోని వయనాడ్‌లో వరద బాధితులకు అందరూ అండగా నిలబడాలని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. గురువారం సీఐటీయూ ఆధ్వర్యంలో పట్టణంలోని వరద బాధితుల కోసం విరాళాల సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడుతూ.. కేరళలో వరదల బీభత్సంతో వయనాడ్ ప్రాంతం పూర్తిగా నీటిలో మునిగిపోయిందన్నారు. ప్రకృతి విపత్తు కారణంగా ప్రజలందరూ నిరాశ్రయులుగా మారారన్నారు. అక్కడి ప్రజలు ఆపన్నహస్తం కోసం ఎదురుచూస్తున్నారని, ప్రజలందరూ మానవతా దృక్పథంతో స్పందించి వరద బాధితులను ఆదుకునేందుకు తమవంతు సహాయ సహకారాలను అందించాలని సూచించారు.

కంగ్రాట్స్ సర్

ఇబ్రహీంపట్నం రూరల్: తెలంగాణ డీజీపీగా పదోన్నతి పొందిన మండలంలోని తులేకలాన్ గ్రామానికి చెందిన భత్తుల శివధర్‌రెడ్డికి శుభాకాంక్షలు వెల్లువెత్తాయి. గ్రామానికి చెందిన వివిధ పార్టీల నాయకులు భారీగా వెళ్లి ఆయనకు పుష్ప గుచ్ఛాలు అందజేశారు. వారిలో గ్రంథాలయ కమిటీ మాజీ జిల్లా చైర్మన్ సత్తు వెంకటరమణారెడ్డి, కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కోడూరి రమేశ్, సీపీఎం నాయకులు బోడ సామేల్ తదితరులు పాల్గొన్నారు.



డీజీపీగా పదోన్నతి పొందిన శివధర్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న రమేశ్

విధులు బహిష్కరించిన న్యాయవాదులు

అడ్వకేట్ దంపతులపై దాడిని నిరసిస్తూ ఆందోళన

ఇబ్రహీంపట్నం: న్యాయవాదులపై జరుగుతున్న దాడులకు నిరసనగా గురువారం ఇబ్రహీంపట్నం న్యాయస్థానంలోని అడ్వకేట్లు విధులు బహిష్కరించారు. స్థానిక కోర్టు ఆవరణలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా స్థానిక బార్ అసోసియేషన్ అధ్యక్షుడు అంజన్‌రెడ్డి మాట్లాడుతూ.. న్యాయవాదులపై పోలీసుల ఆగడాలు రాష్ట్రంలో కొనసాగుతున్నాయని ఆరోపించారు. జనగామ పోలీసులు న్యాయవాద దంపతులైన అమృతరావ్, కవితలపై అమానుషంగా దాడి చేసి అవమానించారన్నారు. ఈ ఘటనకు సంబంధించిన అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘం ప్రధాన కార్యదర్శి మహేందర్, సహాయ కార్యదర్శి ధనంజయగౌడ్, న్యాయవాదులు జగన్, జంగయ్య, జగన్‌గౌడ్, మురళి, గురువారెడ్డి, వెంకట్‌రెడ్డి, మహేందర్, నారాయణరెడ్డి, సాయికుమార్, వెంకటేష్, మల్లేష్, శ్రీశైలం, రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



ఇబ్రహీంపట్నం: కోర్టు ప్రాంగణంలో నిరసన వ్యక్తం చేస్తున్న అడ్వకేట్లు

చర్యలు తీసుకోవాలి

ఆమనగల్లు: జనగామ జిల్లాలో న్యాయవాద దంపతులపై దాడిచేసిన పోలీసులపై చర్యలు తీసుకునేంతవరకు విధుల బహిష్కరణ కొనసాగిస్తామని ఆమనగల్లు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జగన్, కార్యదర్శి ఆంజనేయులు తెలిపారు. పట్టణంలో గురువారం న్యాయవాదులు విధులు బహిష్కరించి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా జగన్, ఆంజనేయులు మాట్లాడుతూ.. దాడిచేసిన పోలీసులపై శాఖాపరంగా, చట్టపరంగా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఆమనగల్లు బార్ అసోసియేషన్ సభ్యులు సుధాకర్‌రెడ్డి, రామకృష్ణ, మధు, శేఖర్, కృష్ణ, మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.



ఆమనగల్లు: ఆందోళన చేపట్టిన న్యాయవాదులు

ఉపాధ్యాయులకు ఘన సన్మానం

కడ్తాల్: మండల కేంద్రంతో పాటు, మండల పరిధిలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలకు చెందిన 93 మంది ఉపాధ్యాయులు ఇటీవల బదిలీ అయ్యారు. ఈ మేరకు గురువారం స్థానిక బాలుర ఉన్నత పాఠశాలలో ఎంఈఓ సర్దార్‌నాయక్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బదిలీ అయిన ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎంఈఓ సర్దార్‌నాయక్ మాట్లాడుతూ.. ఉపాధ్యాయులు ఏ ప్రాంతానికి వెళ్లినా సమయ పాలన పాటిస్తూ పేద విద్యార్థులలో నైతిక విలువలు పెంపొందించాలన్నారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులకు శుభాకాంక్షలు తెలుపుతూ, మెమెంటోలు అందజేసి సన్మానించారు. కార్యక్రమంలో నోడల్ అధికారి జంగయ్య, పీఆర్టీయూ టీఎస్ జిల్లా అధ్యక్షుడు గోవర్ధన్ యాదవ్, యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడుడు గోపాల్‌నాయక్, పీఆర్‌టీయూ మండల అధ్యక్షుడు రాధాకృష్ణారెడ్డి, తపస్ మండల అధ్యక్షుడు సంతోష్ నాయక్, స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు అరుణ, శ్రీనివాస్, ఉపాధ్యాయ సంఘం నాయకులు సుమరంజిత, మల్లయ్యగౌడ్, పద్మావతి, రజాక్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.



బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయులకు సత్కారం

21 నుంచి కట్టమైసమ్మ ఉత్సవాలు

ఆమనగల్లు: పట్టణంలోని సురసముద్రం చెరువుకట్టపై ఉన్న కట్ట మైసమ్మ దేవాలయంలో ఈనెల 21 నుంచి 23 వరకు అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ మక్తాల వెంకటయ్య తెలిపారు. గురువారం దేవాలయం వద్ద ఉత్సవాల కరపత్రాలను స్థానిక నాయకులతో కలిసి ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వెంకటయ్య మాట్లాడుతూ.. పునర్నిర్మించిన కట్టమైసమ్మ దేవాలయంలో ఈనెల 21 నుంచి పాటు ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ వెంకటయ్య, నాయకులు రాజు, శ్రీను, అంజయ్య, వెంకటయ్య, మహేశ్, శివ, మల్లేశ్, చిన్న వెంకటయ్య, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న ఆలయ నిర్వాహకులు

తల్లి పాలతో బిడ్డకు ఆరోగ్యం



కడ్తాల్: మహిళలకు అవగాహన కల్పిస్తున్న సరళాదేవి

కడ్తాల్: తల్లి పాలు బిడ్డకు ఎంతో శ్రేష్ఠమని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సరళాదేవి అన్నారు. గురువారం మండల పరిధిలోని వాస్‌దేవ్‌పూర్ గ్రామంలో తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా అంగన్‌వాడీ కేంద్రంలో మహిళలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సరళాదేవి మాట్లాడుతూ.. చిన్నారులకు ఆరు నెలల వరకు తల్లిపాలు మాత్రమే తాగించాలని, శిశువులకు అమ్మపాలు అమృతమని తెలిపారు. బిడ్డకు కావాల్సిన విటమిన్స్, మినరల్స్ తల్లి పాలలో లభిస్తాయన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ ఉపాధ్యాయులు కమల, సంగీత, శిల్ప, గర్భిణులు, బాలింతలు తదితరులు పాల్గొన్నారు.

అమ్మ పాలపై అవగాహన

తుర్కయంజాల్: తల్లి పాలు బిడ్డకు శ్రేయస్కరమని ఐసీడీఎస్ సూపర్ వైజర్ కల్యాణి తెలిపారు. తల్లి పాల వారోత్సవాల్లో భాగంగా గురువారం ఆమె తుర్కయంజాల్‌లోని 2వ అంగన్‌వాడీ సెంటర్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అతిథిగా హాజరయ్యారు. తల్లి పాల ప్రాముఖ్యత గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ గుండ భాగ్యమ్మ, ఏఎన్ఎం జెస్సీకా, అంగన్‌వాడీ టీచర్ సుశీల తదితరులు పాల్గొన్నారు.



తుర్కయంజాల్‌లో..